

బిసిజి టీకా వికటించి

ఇద్దరు రిమాండ్ ఖైదీలకు అస్వస్థత

ప్రజాశక్తి- మదనపల్లెఅర్బన్

వ్యాక్సిన్ వికటించి ఇద్దరు రిమాండు ఖైదీలు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె స్పెషల్ సబ్ జైలులో గురువారం సబ్ జైలు డాక్టర్ రాధిక ఆదేశాలతో రిమాండు ఖైదీలకు బిసిజి వ్యాక్సిన్ వేశారు. అనంతరం పంపిణీ చేసిన మందులను వేసుకున్నారు. వాసు, పవన్ కుమార్‌కు వ్యాక్సిన్ వికటించడంతో ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్పందించిన జైలు సిబ్బంది బాధితులను స్థానిక సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో కోలు కుంటున్నారు. ప్రమాదమేమి లేదని వైద్యులు తెలిపారు.

గళం విప్పేనా?



ఉక్కు నిర్మాణానికి రెండు సార్లు శంకుస్థాపన చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ (ఫైల్‌ఫోటో)

- 'ఉక్కు' సంకల్పాన్ని ప్రదర్శించాలి
- నత్తనడకన ఎత్తిపోతల పథకాలు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

ప్రజాశక్తి-కడపప్రతినిధి

జిల్లా అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న సామెత చందంగా మారిన నేపథ్యంలో శాసనసభ, పార్లమెంట్ సమావేశాల్లో పాలక, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఉరుముతోంది. రాష్ట్ర విభజన చట్టంలో ఆర్నెళ్లలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామనే హామీల అమలు చేయాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. 2014లో విభజిత రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శాసనసభ తొలి సమావేశాల్లో ఒక్కో జిల్లాను తనదైన శైలిలో అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపించారు. పదేళ్ల వ్యవధిలో పాలక పార్టీలైన టిడిపి, వైసిపి ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో ఎటువంటి పురోగతీ లేకపోవడం ఆందోళన కలిగించింది. రాయలసీమకు గుండెకాయ గండికోట సాగునీటి ప్రాజెక్టు ఇటు వంటి ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటరీలు లేకపోవడంతో అలం కార ప్రాయంగా దర్శనమిస్తోంది. దీనికితోడు గాలేరు-నగరి ఫేజ్-2 పనులకు గ్రహణం వీడలేదు. వెలిగల్లు రిజర్వాయర్‌కు డిస్ట్రిబ్యూటరీలు చేపట్టకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తి పోతల పనుల్లో పురోగతి కనిపించడం లేదు. కడప సూపర్‌స్పెషాలిటీ నిపుణుల నియామకాలు, పరికరాల ఏర్పాటు, టెక్నీషియన్ల నియామకాలు ఎప్పుడు చేపడతారో తెలియడంలేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నేటి నుంచి శాసనసభ, పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేప థ్యంలో జిల్లా ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాకు చెందిన పాలక, ప్రతి పక్ష పార్టీల ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

రాష్ట్ర శాసనసభ, పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధ మైంది. ఈమేరకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు రాజధానులకు చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాల్లోని 13 నియోజకవర్గాలు, రెండు ఎంపీ స్థానాలు పార్లమెంట్ స్థానాలను వైసిపి, రెండు శాసనసభ స్థానాలు మినహా మిగిలిన 11 స్థానాల్లో ఒక్కొక్కటి చొప్పున జనసేన, బిజెపి దక్కించుకోగా, మిగిలిన తొమ్మిది స్థానాల్ని టిడిపి కైవసం చేసుకుంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధి బాధ్యత అధికార, ప్రతి పక్షాల బుజాలపై పడింది. జిల్లాలో కూటమి పార్టీలు పైచేయి సాధించిన నేపథ్యంలో జిల్లా ప్రగతి పరుగులు తీయించాల్సిన బాధ్యత వాటిపై ఉంది. 2017 నవంబర్‌లో అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రలో మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ఉత్పత్తిని సైతం ప్రారంభిస్తామని హామీనిచ్చారు. మూడేళ్ల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. కడప-బెంగళూరు రైల్వేలైన్ పనుల్లో నెలకొన్న స్తబ్దతను తొలగించి, రాష్ట్రవాటాను జత పరిచి పట్టాలెక్కించాల్సిన అవసరం ఉరుముతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించాలి.

గండికోటకు డిస్ట్రిబ్యూటరీలేవీ..?

రాయలసీమ జిల్లాలకు గండికోట ప్రాజెక్టు గుండెకాయలాంటిది. గత మూడేళ్లుగా గండికోట ప్రాజెక్టును 26.86 టిఎంసిలతో నింపుతున్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల ప్రక్రియ సాగుతూనే ఉంది. 1994 నుంచి 23 గ్రామాల వారికి పునరావాస సదుపాయం కల్పన సాగుతూనే ఉంది. గాలేరు-నగరి ఫేజ్ - 2 పనులకు గ్రహణం తొలగడం లేదు.

కడపలో ఫుడ్‌పార్కు గతేమిటో?

కడపలో రూ.12 కోట్లతో ఫుడ్ పార్కును ఏర్పాటు చేస్తానని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదేళ్లుగా ఫుడ్‌పార్క్ కాగితాలకే పరిమితమంది. ఫుడ్‌పార్క్ ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేది.

అపెరల్ పార్కు ఎప్పుడో?

ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని కొర్రపాడు రోడ్డు సమీపంలో 76. 17 ఎకరాలను 47 ప్లాట్లుగా విభజించిన సంగతి తెలిసిందే. రూ.55 కోట్లతో అపెరల్ పార్కు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో చేనేతలు ఉన్న సంగతి తెలిసిందే.

ఏదీ టెక్స్‌టైల్ పార్కు?

2005-06లో మాజీ సిఎం కీ.శే వైఎస్ఆర్ మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. సుమారు 60 ఎకరాలను 128 ప్లాట్లుగా విభజించారు. రూ.7.4 కోట్లతో పనులు చేపట్టారు. రూ. 2.8 కోట్ల వ్యయం చేసినట్లు సమాచారం. అనంతరం ఎటువంటి పురోగతి కనిపించడం లేదు.

ఎపి కార్ల్‌కు నిధులపై అయోమయం

పులివెందుల సమీపంలో రూ.396 కోట్లతో 644 ఎకరాల్లో అంతర్జాతీయ పశు పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎపి కార్ల్‌లో రూ. 255 కోట్లతో పరిపాలనా భవనానికి వ్యయం చేశారు. గత బడ్జెట్‌లో పరి శోధనలకు అరకొర నిధులు కేటాయించారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధ పశువుల పిండాలను సంకరీకరణ ద్వారా వాతా వర ణానికి తట్టుకోగల నూతన జాతి పశువులను సృష్టించ డానికి చర్యలు తీసుకున్నారు. దానికి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపులు చేయాల్సి ఉంది.

వైవీయూలో నిర్మాణ పనులు

యోగివేమనయూనివర్శిటీపై చిన్న చూపు కొనసాగుతోంది. 2008లో రూ.100 కోట్ల వ్యయంతో యూనివర్శిటీ స్థాపనకు శ్రీకారం చుట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాంలో పీజి సెంటర్ యోగి వేమన యూని వర్శిటీగా మార్చి పెద్దఎత్తున నిధులు కేటాయిం చారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన యూనివర్శిటీగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆర్ట్స్‌తోపాటు పలు విభాగాలకు చెందిన భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది.

ఏదీ హార్టీకల్చర్ యూనివర్శిటీ

రాజంపేటలో హార్టీకల్చర్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నామని హామీ నీరు గారిపోయింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఎక్కువగా వాణిజ్య పంటల వ్యాపారం సాగుతోంది. టిడిపి హయాంలో ఎమ్మెల్యేగా గెలిచిన మేడా నందలూరు ప్రాంతంలోని 200 ఎకరాల్లో హార్టీకల్చర్ యూనివర్శిటీ మంజూరు చేయిస్తానని ప్రకటించారు. ఈమేరకు ప్రభుత్వ అధినేత నుంచి హామీ సైతం పొందారు. అనంతరం దీని గురించి మరిచిపోయారని తెలుస్తోంది.

గండికోట గ్రేటర్ కాన్యనేనా?

గండికోట పర్యాటక ప్రాజెక్టును గ్రేటర్ కాన్యన్ తరహాలో అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టారు. రూ.500 కోట్లతో సుందరంగా తీర్చి దిద్దుతామని గండికోట ఉత్సవాలకు హాజరైన అప్పటి టిడిపి హయాంలో మంత్రులు హడావుడి చేశారు. గండికోటలో స్కైవాచ్ సదుపాయం కల్పిస్తానని హామీనిచ్చారు. రూ.10 కోట్లతో రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశాల వరకు పరిమితమయ్యారు. జిల్లాలో అసంపూర్తిగా, అమలుకు నోచుకోని అంశా లపై జిల్లా ప్రజాప్రతినిధులు చర్చకు తీసుకొచ్చి జిల్లాను అభివృద్ధిపథంలోకి నడిపిం చాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- డిఎంహెచ్‌ఒ కొండయ్య

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి



జిల్లాలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించి, వ్యాధులను నివారించడమే తమ లక్ష్యం అని జిల్లా వైద్య అధికారి కొండయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రాబోయే రోజులలో డయేరియా, సీజనల్ వ్యాధులను ఎలా అరకట్టాలి, ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యల గురించి ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు? ఏరియా ఆసుపత్రిల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 49 పిహెచ్‌సిలు, 11 యుపిహెచ్‌సిలు, మూడు ఏరియా ఆస్పత్రులున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపించడం అధికం. వ్యాధుల వ్యాప్తికి గల కారణాలు గుర్తించడం, వ్యాధి నిర్ధారణ చేయడం, నివారణ చర్యలను గురించి తెలియజేస్తున్నాం. చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాంతీయ వైద్య శాలకు, జిల్లా ఆసుపత్రులకు మెరుగైన వైద్య సేవలు కోసం పంపడం జరుగుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం.

సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

తగు లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, పారిశుధ్య చర్యలు చేపట్టడం, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలు తమ ఇంటి వద్ద నీటిని నిల్వ ఉంచకూడదు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన వేడి నీటిని మాత్రమే తీసుకోవాలి.

జిల్లాలో డయేరియా కేసులు ఏమైనా నమోదు అయ్యాయా? నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ఈనెల 1వ తేదీన మొదలైంది. 0 5 సంవత్సరాల వయసు గల పిల్లల్లో 61 కేసులు అన్నమయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నమోదయ్యాయి. వ్యాధి నివారణ కోసం కాచి చల్లార్చిన తాగునీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాజా ఆహారం తీసుకోవడం, బహిరంగ విసర్జనను నివారిస్తూ పారిశుధ్య మరుగుదొడ్లను వినియోగించుకోవడం ద్వారా డయేరియా వ్యాధిని అరికట్టవచ్చును.

జిల్లాలో మందులు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

జిల్లాలో వైద్యం కోసం వైద్యం కోసం ఎటువంటి మందులు కొరత లేదు. ప్రస్తుతం సిబ్బంది కొరత కూడా లేదు. ఉన్న సిబ్బందితో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రజలకు ఆరోగ్యంపై మీరిచ్చే సలహాలు, సూచనలు ?

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. ఆహారానికి ముందు మల్ల విసర్జన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలి. బహిరంగ ప్రదేశాలలో విక్రయించే పదార్థాలను తినరాదు. చిన్న పిల్లల్లో డయేరియా రాకుండా నివారించాలంటే తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు కూడా ఇవ్వాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని వినియోగించాలి, సమీప ఆరోగ్య కేంద్రం, హెచ్‌డబ్ల్యూసి లోను, పిహెచ్‌సిలోను ఆశా కార్యకర్తల వద్ద ఉచితంగా లభిస్తారు. కీటక జనత వ్యాధులు నివారణ కోసం దోమతెరలను వాడాలి.

బిజెపితో స్నేహం ప్రమాదకరం

-ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తుంది
- సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బిజెపితో స్నేహం ప్రమాదకరమని, అది ప్రాంతీయ పార్టీలతో మంచిగా ఉంటూనే వాటిని నలిపి నాశనం చేస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం మదనపల్లె మండలంలోని సిటిఎం వద్ద నున్న ప్రకృతివనంలో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీ టిడిపికి ఉన్నప్పటికీ జనసేన, బిజెపిలతో కలిసి ప్రభుత్వ పాలన చేస్తోందన్నారు. టిడిపి, జనసేన పార్టీలు తమ ఉనికిని విస్మరించి ఎన్‌డిఎ ప్రభుత్వమని చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. బిజెపి ప్రాంతీయ పార్టీలతో స్నేహం చేసిన ప్రతిసారి ఆయా పార్టీలు ముక్కలు, చెక్కలు కావడం చూశామన్నారు. దేశంలో అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని వివరించారు. బిజెపిది ధృతరాష్ట్ర కౌగిలని అభివర్ణించారు. రాష్ట్రంలోని టిడిపి, జనసేన పార్టీలు గత దృష్టా ంతాలను ఎంతతొందరగా గుర్తిస్తే అంత మంచిదన్నారు. బిజెపి ఏ రాష్ట్ర ప్రభుత్వంతో స్నేహంగా ఉంటే, ఆ రాష్ట్రంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ మతకలహాలను, మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని వివరించారు. బిజెపితో ప్రత్యక్షంగా, పరోక్షంగా స్నేహం చేసిన వైసిపి, టిఆర్ఎస్‌లకు, యుపి, పంజాబ్‌ల్లోని కొన్ని పార్టీలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని గుర్తు చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ మతోన్మాద శక్తులు పెరగకూడదని సిపిఎం కోరుకుంటోందని చెప్పారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లిన నేపథ్యంలో రాష్ట్ర విభజన హామీలపైనా, విశాఖ ఉక్కు, ప్రత్యేక హోదాపైన కేంద్ర ప్రభుత్వంతో చర్చించి హామీ తీసుకోవాల్సి ఉన్నా ఆ ప్రయత్నం కనిపించలేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, పేదలకు చెందిన లక్షలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అన్యాక్రాంతం అయిన భూములు వెంటనే స్వాధీనం చేసుకుని వాటిని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా సామాగ్రాభివృద్ధి కోసం సిపిఎం రానున్న కాలంలో నిర్దిష్ట ప్రణాళిక తయారుచేసి, పార్టీ సభ్యులను కదిలించి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, రామయ్య, రమేష్ బాబు, రామచంద్ర, వెంకటయ్య, చలపతి, శేఖర్ నాయక్, రమణ పాల్గొన్నారు

'జ్ఞానాంబిక' సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథి గా హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో జ్ఞానాంబిక కళాశాల ముందు ఉండడం సంతోషకరమన్నారు. కరస్పాండెంట్ ఆర్. గురు ప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి అరబిందో కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. వీరికి కంటి పరీక్ష, కాట్రేక్ట్ ఎవల్యూషన్, డయాబెటిక్ రెటినోపతి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇందులో 25 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని, వీరికి తిరుపతిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రచన, క్యాంపు కో- ఆర్డినేటర్ కె.వినోద్ కుమార్, ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

కార్యాచరణను విజయవంతం చేయాలి : యుటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం దశలవారీ రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందించే కార్యాచరణను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. హరిప్రసాద్, షేక్ జాబీర్ పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాచరణను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం జిఓ 117ను రద్దు చేసి 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రీ ప్రైమరీ, 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, హైస్కూళ్లలో రెండు మీడియాలను సమాంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. మున్సిపల్ స్కూళ్లలో పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, పిఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులర్ చేయాలని, పాఠశాలలన్నింటికీ స్కూల్ గ్రాంట్స్ మెయింటెనెన్స్ గ్రాంట్స్ మంజూరు చేయాలని, మోడల్ స్కూళ్ల టీచర్లకు కారుణ్య నియామకాలు కల్పించాలని, కిలోమీటర్ దాటి వస్తున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని చెప్పారు. వివిధ కారాణాలతో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని కోరారు. ఈ అంశాలపై ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు విజ్ఞాపన పత్రాలు, ఆగస్టు 5 నుంచి 15 వరకు రాష్ట్రంలోని అందరూ ఎమ్మెల్యేలకూ వినతులు ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి 30 వరకు 3 వేల సంతకాలతో మంత్రులకు విజ్ఞాపన అందించాలని. కోరారు. సెప్టెంబరు ఒకటి నుంచి పదో తేదీ వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్టు కార్డులు పంపించాలని పిలుపునిచ్చారు. సంఘం నిర్ణయాలను అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు టి. సుధాకర్ నాయుడు, జిల్లా సహాధ్యక్షులు ఎస్. శివారెడ్డి, జిల్లా కార్యదర్శులు అక్రమ్‌బాష, భాస్కర్ రెడ్డి, పురం వెంకటరమణ, శ్రీధర్ రెడ్డి,రమణమూర్తి,జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల నష్టాలను భర్తీచేయాలి

ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నరసయ్య

ప్రజాశక్తి - రాయచోటి

గత ప్రభుత్వంలో విలీనం వల్ల ఆర్‌టిసి ఉద్యోగులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒభవంలో సి.ఎ.బాబు, బి చంద్రశేఖర అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, జోనల్ కార్యదర్శి రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా నరసయ్య మాట్లాడుతూఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలోకి విలీనం చేసినా వారు కోరుకున్న పాత పెన్షన్ లాంటి ప్రయోజనాలు పొందలేదని పేర్కొన్నారు. ఆర్‌టిసిలో దశాబ్దాలుగా ఉద్యోగుల బాగస్వామ్యంతో ఉన్న ఎస్ఆర్‌బిఎస్ లాంటి పెన్షన్ స్కీమ్ ను రద్దు చేయడమే కాకుండా గతంలో ఒక్క రూపాయి చెల్లించకుండా సంస్థ పథకంతో నడుస్తున్న రిఫరల్ ఆసుపత్రుల వైద్య సౌకర్యాలను తొలగించారని చెప్పారు. ఇహెచ్ఎస్ సౌకర్యం కల్పించడం వల్ల సకాలంలో వైద్య సౌకర్యాలు అందడం లేదని వాపోయారు. గత ప్రభుత్వం ప్రక్కన పెట్టిన ఉద్యోగ భద్రత సర్క్యులర్ నెంబర్: 1/2019ను సంస్థ, ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించుతుందన్న నమ్మకంతో ఉన్నారని, భవిష్యత్‌లో ఉద్యోగుల నమ్మకాలు వమ్ము కాకుండా ఉండేలా కూటమి ప్రభుత్వం ఆర్టీసి ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. సమావేశంలో జోనల్ కార్యదర్శి యన్. రాజశేఖర్ మాట్లా డుతూ డ్రైవర్లకు ఇంక్రిమెంట్ల, ఉద్యోగోన్నతుల కోసం కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను లిటరసి టెస్ట్ నిర్వహించమని కోరగా జోన్ వ్యాప్తంగా అన్ని జిల్లాలలో లిటరసి టెస్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో రిమూవల్ అప్పీళ్లను, నైట్ హాల్టు అలవెన్సులు చెల్లించాలని కోరారు. సమావేశంలో జోనల్ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, జిల్లా గౌరవాధ్యక్షులు నాగభూషణంరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ,ఐదు డిపో అధ్యక్ష, కార్యదర్శులు, డిపోల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, ఆరోగ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



క్రీడాకారులను సన్మానిస్తున్న నాగ చంద్రశేఖర్‌రెడ్డి

మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల ఆత్మరక్షణ మెలుకువలు నేర్చుకోవడంతో పాటు మెరుగైన ఆరోగ్యం కూడా మన సొంతమవుతుందని ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు చౌడవరం చరణ్ కుమార్, కె. గంగారమ్ బ్లాక్ బెల్ట్‌లు సాధించిన సందర్భంగా ఆదివారం జిఎంసి క్లబ్ ప్రాంగణంలో క్రీడాకారులను ఆయన శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కేక్ కట్ చేసి క్రీడాకారులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ సాధన వలన క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందన్నారు. క్రీడా కోటా ద్వారా విద్య, ఉద్యోగాలలో సైతం రాణించవచ్చునని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, ప్రముఖ ఆంగ్ల బోధకులు యానాది, కోచ్ కె.నాగరాజ, కె.గంగారాం, క్రీడాకారులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులతో పీడీ

రాష్ట్ర స్థాయి తేక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ఎంపిసి చదువుతున్న జి.భార్గవి , రోహిత్‌లు రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. ఆదివారం జిల్లాస్థాయి తేక్వాండో జూనియర్, సీనియర్ పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి ఆగస్టు నెలలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి తేక్వాండో పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ లీలశ్రీహరి, పాఠశాల బృందం, తల్లిదండ్రులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో చోటు సంపాదించే విధంగా అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



డాబాను ప్రారంభిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

డాబా హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని బండపల్లి టోల్ ప్లాజా వద్ద రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అనుచరులు సుదర్శన్ సూర్యనారాయణరెడ్డి నిర్మించిన నూతన ఎస్ఎస్ దాబా హోటల్‌ను మంత్రి సోదరుడు, టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ సమీపంలో ప్రయాణికులకు అనుకూలంగా , కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో హోటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నాణ్యత ప్రమాణాలతో ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్య క్రమం లో మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు సహదేవరెడ్డి పాల్గొన్నారు.




ఊరేగింపుగా బయలుదేరిన పీర్లు

రెడ్డిపల్లెలో ఘనంగా పీర్ల పండగ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోనిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ నందు ఆదివారం ఘనంగా పీర్ల పండగ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ముస్లిములు, హిందువులు సోదర భావంతో ఇలాంటి పండుగలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామ పెద్దలు ఈ పండుగ సందర్భంగా బంధువులు గ్రామస్తులు కలుసుకోవడం ఒక ఆనవాయితీగా వస్తున్న ఈ పండుగలను గ్రామస్తులు కలిసిమెలిసి చేసుకోవడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. దాదాపు వారం రోజుల నుంచి గ్రామంలో పండగను అంగరంగ వైభంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.ముస్లిములు ఎవరూ లేకపోయినా కూడా హిందువులే పీర్లను పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నారని చెప్పారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న చాంద్‌బాషా

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మీదే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం మీదేనని హిందీ పాఠ్యాంశ నిపుణులు చాంద్‌బాషా, పార్వతి, మూర్తి తెలియజేశారు. ప్రేమ్ చంద్ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భారతీయ విద్యా నికేతన్ పాఠశాల నందు హిందీ టెట్, డిఎస్‌సి పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. సబ్జెక్ట్ నిపుణులు చాంద్‌బాషా, పార్వతి, మూర్తి అభ్యర్థులకు పలు సూచనలు అందించారు. పరీక్షకు ఎలా సన్నద్ధం అవ్వాలో, ఏ పుస్తకాలు ఎన్నుకోవాలో అనే విషయాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

వాల్మీకులకు అండగా ఉంటాం :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకులకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే షాజనహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె-చెంబకూరు రోడ్డు బోయవీధిలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర నూతన కార్యాలయాన్ని రాష్ట్రీయ వాల్మీకి ధర్మసమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాణ సంచా పేల్చి ఘనస్వాగతం పలికి, పూల మాలలు, దృశ్యాలవులతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి విఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు పొదల నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ, నమ్మితే ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని తత్వం వాల్మీకులదని, నమ్మకానికి మారుపేరు, నమ్మకానికి ప్రతిరూపం వాల్మీకులేనని పేర్కొన్నారు. వాల్మీకి కులస్తులకు నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు గంపల గంగరాజు, రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్‌మోహన్,రాష్ట్ర యువత అధ్యక్షులు టేకుపల్లి శ్రీనివాసులు, నల్లబోతుల సుదర్శనబాబు, బిసి సంఘ నాయకులు కృష్ణప్ప, శేఖర్, నాని, బాలు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో రామతులశమ్మ 21వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన తన సతీమణి హరితతో కలిసి రామతులశమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం 30 మంది విభిన్నప్రతి భావంతులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీం ద్రారెడ్డి దంపతులను వికలాంగుల నెట్ వర్క్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, కార్యవర్గ సభ్యులు గంగయ్య, సిద్ధారెడ్డి, సాయి, మహమ్మద్ వలి పాల్గొన్నారు.

రావణకాష్టంలా కూటమి పాలన : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నలభై రోజుల్లోనే రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మారుస్తోందని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నలభై రోజుల్లోనే రాష్ట్రం మరో బీహార్‌లా తయారైందని అన్నారు. కొందరు కూటమి నాయ కులు సోషల్ మీడియా మధ్యమాల్లో మహిళలను కించపరుస్తూ పోస్టింగులు పెడుతున్నారని అది మంచి పద్దతి కాదని అన్నారు. ఏమైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ ఇలా వ్యక్తిగత విమ ర్శలు తగవని అన్నారు. దేశంలో మునుపెన్నడు లేని విధంగా అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన పార్టీ ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనమన్నారు, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకరికే అంటున్నారని అన్నారు. ఉచిత ఇసుక అన్నారు షరతులు వర్తిస్తాయని చెబుతున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి గాలికి వదిలేసి వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ధమనకాండకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీనియర్ నాయకులు సుకుమార్‌రెడ్డి, సిహెచ్ రమేష్, భరత్‌కుమార్‌రెడ్డి, కరీముల్లా, రత్తయ్య, ఎంపిటిసి బండారు మల్లి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

డ్రగ్స్ రహిత మదనపల్లె కోసం కృషి : ఎమ్మెల్యే



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డ్రగ్స్ రహిత మదనపల్లె కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం, యువత భవితకు బంగారు బాటలు వేద్దాం, డ్రగ్స్ రహిత మదనపల్లెను సాధిద్దాం అంటూ మద నపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు డాక్టర్ ఏ.ఆర్.సురేష్, కరాటే విద్యార్థులు ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. మదనపల్లె ప్రాంతంలో డ్రగ్స్ విని యోగం ఉన్నట్లయితే అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడ్డ యువత జీవితాలను చేజేతులారా నాశనం చేసుకుంటుందని అన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను యువతకు అవగాహన కల్పిం చాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సమాజ శ్రేయోభిలాషులపై ఉందన్నారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండి ఉన్నత విద్యనభ్యసించి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఎ.ఆర్.సురేష్ మాట్లాడుతూ మదనపల్లె అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇచ్చిన పిలుపు మేరకు డ్రగ్స్ రహిత మదనపల్లె ధ్యేయంగా పని చేస్తామని ప్రకటించారు. మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థుల ద్వారా మరిన్నీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్ల డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యేను దుశ్శాలు వాతో ఘ నంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎస్.ఎ. మస్తాన్, కౌన్సిలర్ తులసి రామకృష్ణ, ఐటియుసి క్రిష్ణమూర్తి, హాస్టల్ వార్డెన్ వెంకటేష్, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, నరసింహ యాదవ్ యూత్ కరాటే క్లబ్ మణిసాయి, మహేశ్వర్, మిస్బా, ముజీబ్ ,కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

'లయన్స్ క్లబ్' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పీలేరు

లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం స్థానిక బికెఆర్ రెసిడెన్సీలో జరిగిన లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినం ఎన్నికల అధి.కారిగా జిల్లా క్లబ్ పూర్వ గవర్నర్ లయన్ కె.భక్తవత్సలరెడ్డి వ్యవహరించడంతో పాటు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూడా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన జీవిత బీమా సంస్థ విశ్రాంత మేనేజర్ బివి రమ ణారెడ్డి, కార్యదర్శి ఏకాంతంరెడ్డి, కోశాధికారి శివఫణేష్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్య క్రమాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, కంటిపరీక్షా శిబిరాలు నిర్వహించి ఎంపికైన వారికి కంటి ఆపరేషన్లు చేయించి, కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇచ్చే కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలని అన్నారు. సేవా కార్యక్రమాలు పట్టణాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి విస్తరింప చేయాలని అన్నారు. దీంతో పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు చేయూత ఇచ్చినవారవుతామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షులు రమణారెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలతో పాటు ప్రధానంగా పీలేరును కాలుష్య, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని, దీనికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరమణ, హుమయూన్, కష్ణారెడ్డి, బిజెపి రమణ పాల్గొన్నారు.



రమణారెడ్డిని అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



రైల్వేకోడూరు: పల్లకి మోస్తున్న రూపానందరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేఅరవ శ్రీధర్ గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గురు పౌర్ణమి సందర్భంగా తిరు పతి లోని రూపానందరెడ్డి నివాసం వద్ద శ్రీ సాయిబాబాగుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు,పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరు పతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, రైల్వేకోడూరు ఎన్‌డిఎ కూటమి ముఖ్య నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.**రాజంపేట అర్బన్ :** పట్టణ పరిధిలోని మన్నూరులో గల శ్రీ గోదా మహాలక్ష్మి సమేత ఐరావత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. టిటిడి ధర్మ ప్రచార పరిషత్తు ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, హైమవతి దంపతులు తమ పిల్లలు జగతి, జాగృతీల పుట్టిన రోజైన గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చక స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.**నందలూరు:** మండలంలోని కడప- చెన్నై జాతీయ రహదారి కన్యకా చెరువు కట్ట పై వెలసిన సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి మండపాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.**రామాపురం:** అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తే గురువుని వైసిపి జిల్లా అధ్యక్షుడు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.గురు పౌర్ణమి సందర్భంగా మండలం లోని నీలకంఠరావుపేట దర్గా, షిర్డీ సాయి ఆలయంలోనూ, సద్గురు దర్గా స్వామీజీ, సద్గురు దర్గా మాతాజీల వద్ద నిర్వహించిన వేడుకల్లో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు తీర్థ ప్రసా దాలు అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి వర్షా లు బాగా కురిసి, పంటలు బాగా పండి ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ఆయన ఆకాం క్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆయూబ్, సిరాజ్, సహదేవ రెడ్డి, ఇంతియాజ్, జాఫర్, దర్బార్, రియాజ్, ఆంజనేయులు, కొండయ్య, శ్రీనివాసులు, ఖాజా, ఇలియాజ్ పాల్గొన్నారు.**కలికిరి:** గురు పౌర్ణమి వేడుకలు కదిరిలోని కొత్త సాయిబాబా ఆలయంలో వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని కలికిరి సాయినగర్‌లో వెలసిన సాయిబాబా ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో సాయిబాబాను దర్శించుకున్నారు. సాయంత్రం పల్లకిలో సాయి బాబాను ఊరేగించి వైభవంగా పల్లకిసేవ నిర్వహించారు. **తంబళ్లపల్లె :** మండల కేంద్రంలో కోర్ట్ సమీపంలో వెలసిన శేష సాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు వెంకటేష్, సుధాకర్‌లు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారికి ప్రతేక అలంకరణ చేసి పూజలు అభిషేకాలు నిర్వహించారు.మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలోనూ పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. **పీలేరు:** పీలేరులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి ఉత్సవాలు వైభ వంగా జరిగాయి. ఆలయ అర్చకులు శివ ప్రసాద్ స్వామి మాట్లాడుతూ బాబాకు పంచామృత అభి షేకం, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఆల యానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆలయ నిర్వహణ కమిటీ తగిన ఏర్పా ట్లు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయకమిటీతో పాటు మేనేజర్ రాజారెడ్డి, సీన పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్ :** గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగాను, శోభాయమానంగాను జరిగాయి. పట్టణంలోని బర్మా రోడ్డులో ఉన్న ప్రధాన శిరిడి సాయిబాబా ఆలయం తో పాటు పెంచిపాడు రోడ్డు, కోటవీధి, అయ్యప్ప స్వామి గుడి, కురవంక, బైపాస్ రోడ్డు, ఎర్రగానిమిట్ట సాయికొండ తదితర ప్రాంతాలలో ఉన్న సాయిబాబా ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ప్రతి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయిబాబా భజనలు చేసి కీర్తనలు పాడి బాబా ఆశీస్సులు పొందారు. ప్రతి ఆలయంలోనూ భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పట్టణంలోని అన్ని ప్రధాన బాబా ఆలయాల్లో పర్యటించి బాబా ఆశీస్సులు పొందారు. భక్తులను పలకరించి వారితో మమేకమై అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, ఆయా ఆలయాల నిర్వాహకులు ఉన్నారు. **పెద్దమండ్యం :** మండలం లోని పాపెపల్లి పంచాయత్‌లో శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దాతల సహకా రంతో భక్తుల కోసం మధ్యాహ్నం అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

-అధ్యక్ష, కార్యదర్శులుగా ముబారక్, వాసు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపల్ కాంట్రాక్టర్, అవుట్‌సోర్సింగ్, డైలీ వేజెస్ వర్క ర్స్ యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.ముబారక్, ఎస్.వాసు లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఆదివారం స్థానిక చలపతిరావు కాలనీలోని యూ నియన్ కార్యాలయంలో జరిగిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో కాంట్రాక్, ఔట్ సోర్సింగ్ డైలీ వేజెస్ పర్మనెంట్ కార్మికులు హాజ రయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్క రించు కుందామన్నారు. ము ఖ్యంగా వెంకప్పకోటలో పారిశుధ్య కార్మికుల కోసం కేటా యించిన స్థలాన్ని శుభ్రం చేసి కార్మికులకు ప్లాట్లుగా విభజించి కేటాయించి మున్సి పల్ క్వార్టర్స్ గా నిర్మించి ఇవ్వాలని కార్మికులందరూ తీర్మానించారు. కార్మికులకు రావాల్సిన సోపు, నూనె, చెప్పులు సకాలంలో కార్మికులకు అందేలా అధికారులకు వివరించి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించు కుందామని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సంజీవయ్య, నాయకులు శ్రీనివాసులు పోతులప్ప, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు



అడవి పందుల దాడిలో ధ్వంసమైన కర్బూజ

పది ఎకరాల్లో కర్బూజ పంట ధ్వంసం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం బాలిరెడ్డిపల్లె పంచాయతీ ఇందిరానగర్ వద్ద పది ఎకరాలలో కర్బూజ పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందులు తోటలోకి ప్రవేశించి డమ్ము పార్వతమ్మకు చెందిన ఐదు ఎకరాలు, వెంకటరమణ కు చెందిన ఐదు ఎకరాలను ధ్వంసం చేశాయని తెలిపారు. వ్యయ ప్రయాసాలతో కర్బూజను సాగుచేసుకుంటే అడవి పందులు పంటంతా నాశయనం చేశాయని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

రేపు ఉపాధి హామీపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 23న ఉపాధి హామీ పథకంపై 17వ విడత సామాజిక తనిఖీ, బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నూర్జహాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులు, చెల్లించిన నగదు తదితర అంశాలపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సామాజిక తనఖీకి మండ లంలోని ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది తమ నివేదికలతో రావాలని, సూచించారు. మండలస్థాయి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మస్తాన్‌రాయల్

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిట్వేలి

కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని సంకల్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని తిమ్మాయపాలెం గ్రామపంచాయతీ గట్టుమీద పల్లెకు చెందిన అద్దంకి సురేష్ వైద్య ఖర్చులకోసం ఫైట్ ఫర్ యువర్ రైట్స్ సంస్థ తరపున యెద్దల చెంగలరాయుడు ఆదివారం సురేష్ ఇంటికి వెళ్లి పదివేల రూపా యల నగదు అందించారు. సురేష్ అనారోగ్య పరిస్థితిని గట్టుమీద పల్లె వాసులు చెప్పడంతో అక్కడ వారంతా కలిసి సురేష్ ఆరోగ్యంగా తిరిగి రావాలని అమె రికాలో ఉద్యోగం చేస్తున్న నేతివారిపల్లికి చెంగలరాయుడు పంపించారని తెలి పారు. ఈ నగదును యర్రంశెట్టి మస్తాన్ రాయలు, పిడుగు సుబ్బారాయుడు ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో మాదాసు శివ, సువ్వారపు నాగేష్, షేక్ రియాజ్, శివ, చిన్నయ్య, సురేష్ పాల్గొన్నారు.

మదనపల్లె సబ్ కలెక్టర్‌గా మేఘస్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా మేఘ స్వరూప్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఇక్కడ ఆర్‌డిఒగా పనిచేస్తున్న హరి ప్రసాద్ తిరిగి అనం తపురం జిల్లాకే బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు మద నపల్లె ఆర్‌డిఒగా వ చ్చిన హరిప్రసాద్ ఎన్నికల విధులను సజావుగా పూర్తిచేసి, అధికారుల మన్న నలు పొందారు. బదిలీల ప్రక్రియలో భాగంగా అనంతపురం కార్పొరే షన్‌కు కమిషనర్‌గా పనిచేస్తున్న మేఘ స్వరూప్‌ను మదనపల్లె సబ్ కలెక్టరుగా నియ మించారు.



చెక్కును అందిస్తున్న దయానంద్‌రెడ్డి

చైతన్య సేవా సంస్థ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంస నీయమని సెరికల్చర్ రిటైర్డ్ డైరెక్టర్ దయానందరెడ్డి కితాబిచ్చారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి చైతన్య సంస్థను సందర్శించారు. రెడ్డివారి దయానందరెడ్డి మనవడు మాయక్ పుట్టినరోజు సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.7 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మాయక్‌కు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణచరణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వీరి కుటుంబసభ్యులు గతంలో పలుమార్లు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. చైతన్య కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ కం చైర్మన్ ఎం.పి.ఆనందన్, ట్రెజరర్ పట్నం గిరిజమ్మాల్, చిన్నారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి స్థలం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాష హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోం నందు పెన్షనర్స్ అసోసియేషన్, ఎన్‌జిఒ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ అధ్యక్షుడు ఎం.నరసింహ రెడ్డి, పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు బిటి.నరసింహులు మాట్లాడుతూ పెన్షనర్లు గత ప్రభుత్వ హయాంలో పడిన ఇబ్బందులను వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మా ప్రభు త్వంలో అటు వంటి పరిస్థితులు ఉండవని అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం పెన్షనర్లతో స్నేహ పూర్వకంగా మెలగుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతుంద న్నారు. పెన్షనర్లు ప్రభుత్వానికి సహకరిస్తూ తగు సలహాలు, సూచనలు చేయాలని కోరారు. సమావేశంలో ఎన్‌జిఒ సంఘ సభ్యులు, పెన్షనర్‌లు పాల్గొన్నారు.

పెట్టుబడులు, పరిశ్రమలు అడ్డుకునేందుకు వైసిపి కుట్ర

ప్రజాశక్తి - చాపాడు :రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా అడ్డుకునేందుకు వైసిపి నాయకులు కుట్ర పన్నుతున్నారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.ముని శేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు అని ఢిల్లీలో ధర్నా చేస్తా అనడం సిగ్గుచేటన్నారు. వినుకొండ సంఘటనపై వైసిపి నాయకులు మాట్లాడుతుంటే రాష్ట్ర ప్రజలు విడ్డూరంగా చూస్తున్నారన్నారు. ఒక దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను హింసించినప్పుడు, ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను హత్య చేసినప్పుడు, నంద్యాలలో ఒక ముస్లిం మైనారిటీ కుటుంబానికి చెందిన అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఎందుకు మాట్లడలేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న మంచి పేరుని చెడిపేస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు జరిగిన సంఘటనలపై, 2019 నుంచి 2024 వరకు శాంతిభద్రతలపై పోలీస్ క్రైమ్ పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.